
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.4 కనిష్ఠం 21.2
నిర్మల్
జిల్లా వార్తలు



శుక్రవారం 22 మార్చి 2024

బీఆర్‌ఎస్‌కు.. బిగ్‌షాక్



- కారులో ముమ్మరమవుతున్న వలసలు
- హస్తం గూటికి ముథోల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు విఠల్‌రెడ్డి
- అదేబాటలో పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు
- ఇక వరుస కట్టి మొదలుకానున్న చేరికలు
- నేడో రేపో కీలక నేతదీ అదే దారి

నిర్మల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పార్టీ ఫిరాయింపుల పర్వం క్రమక్రమంగా పతాకస్థాయికి చేరుకుంటోంది. నిన్నటి వరకు బీఆర్ఎస్‌కు చెందిన చోటా మోటా నాయకులు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ ఈ చేరికల పర్వం క్రమంగా ముమ్మరమవుతోంది. గురువారం బీఆర్ఎస్ పార్టీని ఫిరాయింపులు కుదిపేశాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అనూహ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. గత కొద్ది రోజుల నుంచి విఠల్‌రెడ్డి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రచారానికి అనుగుణంగానే మొట్ట మొదట విఠల్‌రెడ్డి కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో ఆయనకు సముచిత స్థానమే దక్కినప్పటికీ అధికారపార్టీ వైపు ఆయన అడుగులు వేయడం మొదలుపెట్టారు. ఎన్నికల్లో ఓటమి చెందిన నాటి నుంచి విఠల్‌రెడ్డి అసంతృప్తితోనే ఉంటున్నారు. అయితే విఠల్‌రెడ్డికి రాజకీయంగా అండగా నిలిచే మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సైతం మూడు నాలుగు రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇప్పటికే ఆ దిశగా ఇంద్రకరణ్‌రెడ్డి అన్ని రకాల ఏర్పాట్లు చేసుకున్నారంటున్నారు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దంటూ నిర్మల్ నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలంతా పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరంతా సీఎం రేవంత్‌రెడ్డికి సైతం ఇంద్రకరణ్‌రెడ్డికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఆందోళనలు, ఫిర్యాదుల కారణంగానే ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆలస్యమవుతోందంటున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు వర్గీయులు తమ కార్యకలాపాలను ముమ్మరంగా చేస్తున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన చాలా మంది సీనియర్ నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే మామడ వైస్ ఎంపీపీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎనుగు లింగారెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వీడీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయితే ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే డీసీసీ అధ్యక్షుడు లేకుండానే ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నేరుగా సీఎం వద్ద కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకోవడం చర్చకు తావిస్తోందంటున్నారు. విఠల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఇక తదుపరి వంతు ఇంద్రకరణ్‌రెడ్డి దేనంటున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి ప్రమేయంతోనే విఠల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరాడని ప్రచారం జరుగుతోంది. విఠల్‌రెడ్డి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాలను తుచ తప్పకుండా పాటిస్తారంటున్నారు. ఆయన సూచనల మేరకే విఠల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారన్న చర్చ జరుగుతోంది. మరో వారం రోజుల్లో జిల్లా రాజకీయ సమీకరణలు పెద్ద ఎత్తున తలకిందులు కాబోతున్నాయంటున్నారు.

అందరి చూపు కాంగ్రెస్ వైపు

కాగా ప్రస్తుతం పార్టీ ఫిరాయింపుల పర్వం పతాకస్థాయికి చేరుకుంటోంది. నిన్నా మొన్నటి వరకు స్తబ్దంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధికారం కోల్పోయిన అంశాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. వంద రోజులు కూడా వారు అధికారం లేకుండా ఉండలేకపోతున్నారు. క్రమంగా వీరంతా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. చోటా, మోటా నేతలే కాకుండా మొన్నటి వరకు రాష్ట్రప్రభుత్వంలో కీలకపదవులు అనుభవించిన వారు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతుండడం చర్చనీయాంశమవుతోంది. నిన్నటి వరకు మండల స్థాయి నాయకులు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరగా ప్రస్తుతం సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు సైతం వలసబాట పట్టారు. బీఆర్ఎస్ పార్టీకి మొన్నటి వరకు వెన్నుదన్నుగా నిలిచి అన్ని తానై వ్యవహరించిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆయన స్థానిక నేతలకు సమాచారం ఇవ్వకుండానే చాపకింద నీరులా సమీకరణలు జరిపి ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. ఈయన చేరిక ద్వారా మరో ముఖ్యనేత చేరికపై క్లారిటీ వస్తోందంటున్నారు. అయితే విఠల్‌రెడ్డి గత కొద్దిరోజుల నుంచి తన అనుచరులు, అభిమానులతో గుట్టు చప్పుడు కాకుండా చర్చలు జరుపుతున్నారని, బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానానికి ఎలాంటి అనుమానాలు రాకుండా ఆయన జాగ్రత్తలు తీసుకుంటూనే కాంగ్రెస్ పార్టీ వైపు అడుగులు వేశారంటున్నారు. ఓ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే స్థాయి నాయకుడైన విఠల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అక్కడి బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలిందని అంటున్నారు.

హస్తం వైపు అడుగులు వేస్తున్న మరో కీలకనేత

ఇదిలా ఉండగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరో కీలకనేత హస్తం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి ఈ నేత ఆధ్వర్యంలోనే మిగతా నాయకులంతా కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు ప్రచారం జరిగింది. అయితే సదరు నేత లేకుండానే గురువారం ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఇక చేరికల వ్యవహారం కీలక ఘట్టానికి చేరువైందంటున్నారు. మొన్నటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండుసార్లు మంత్రి పదవిని చేపట్టిన ఇంద్రకరణ్‌రెడ్డి ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని ఆయన సన్నిహిత వర్గాలు బహిరంగంగానే పేర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే ఇంద్రకరణ్‌రెడ్డి ఇప్పటికే పలుసార్లు తన అనుచరులతో సీరియస్‌గా మంతనాలు జరిపి పార్టీ మారే విషయమై ఓ నిర్ణయానికి వచ్చారంటున్నారు. ఇప్పటికే ఆయన హైదరాబాద్‌లోని పార్టీ పెద్దలతో తన చేరిక వ్యవహారంపై సీరియస్‌గానే చర్చలు జరుపుతున్నారంటున్నారు. ఇదిలా ఉండగా ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దంటూ ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇంద్రకరణ్ రెడ్డి చేరికపై ఆ పార్టీ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ జారీ చేసేట్లయితే మొదట స్థానిక నేతలను ఒప్పించే ప్రయత్నాలు చేయాల్సి ఉంటుందంటున్నారు. దీని కోసం ఓ రాష్ట్రస్థాయి నాయకుడికి సయోధ్య బాధ్యతలు అప్పజెప్పే అవకాశాలున్నాయంటున్నారు.

కమనీయంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

భైంసా,మార్చి 21: పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం బ్రహ్మోత్సవాలలో భాగంగా పద్మావతీ శ్రీనివాసుల కల్యాణ మహోత్సవ వేడుకలు కమనీయంగా కొనసాగాయి. మధ్యాహ్నం 12 గంటలకు పద్మావతి సమేత శ్రీనివాసస్వామి ఉత్సవమూర్తుల కల్యాణోత్సవ శోభాయాత్రతో ప్రారంభమైన వేడుకలు సాయంత్రం వరకు భక్తుల కోలాహలం మధ్య వైభవంగా కొనసాగాయి. ఆలయ ప్రాంగణం నుంచి ఉత్సవ మూర్తులకు కల్యాణవేదిక వద్దకు ముస్తాబు చేసి శోభాయాత్రగా తీసుకవచ్చారు. శ్రీనివాసుడిని అశ్వవాహనంపై, అమ్మవార్లను పల్లకిలో కల్యాణవేదిక వద్ద భాజభజంత్రీల మధ్య తీసుకవచ్చారు. కల్యాణ వేడుకలను నిర్వహించే దంపతులు తమ తలలపై తలంబ్రాలు, పట్టువస్త్రాలతో మంగళహారతులతో ముందు నడువగా వెనుకభాగంలో ఉత్సవమూర్తులను శోభాయాత్రగా కల్యాణవేదిక వద్దకు తీసుకవచ్చారు. అనంతరం వేదపండితులు చక్రవర్తుల సుదాన్వచారి చేతుల మీదుగా కల్యాణోత్సవ వేడుకలు కమనీయంగా కొనసాగాయి. రెండున్నర గంటలు శాస్త్రోక్తంగా, మంత్రోచ్చారణల మధ్య శ్రీవారి కల్యాణోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహణ కమిటీ భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టింది. రాత్రి పద్మావతీనగర్ పురవీధుల్లో శ్రీస్వామి వారి పల్లకిని ఊరేగించారు. వేడుకలకు పట్టణ భక్తులే కాకుండా సమీప గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, టౌన్ సీఐ రాజారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి. గురువారం కల్యాణోత్సవ వేడుకలను పురస్కరించుకొని నయనం నృత్య కళానిలయం. వాగ్దేవి కళానిలయం నృత్య పాఠశాలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు వేడుకలకు వన్నెతెచ్చాయి. కల్యాణోత్సవం సందర్భంగా గంటపాటు విద్యార్థులు లక్ష్మీ వెంకటేశ్వరస్వామికి సంబంధించిన గేయాలు పాడుతూ, నృత్యాలు చేశారు. కల్యాణోత్సవ సందర్భంగా పలువురు మహిళలు పూలదండలతో శ్రీనివాసుడిని, అమ్మవార్లను కొలుస్తూ భక్తుల మధ్య నుంచి నృత్యాలు చేస్తూ వేదిక వద్దకు వస్తు నిర్వహించిన ప్రదర్శనలు ఆహుతులను సంబురపరిచింది.

చామన్‌పెల్లిలో గోదల పెద్ద పండగ



లక్ష్మణచాంద, మార్చి 21 : మండలంలోని చామన్ పెల్లి గ్రామంలో గురువారం గోదల పండగగా ప్రసిద్ధి పొందిన పశువుల పెద్ద పండుగను నిర్వహించారు. పంట వేసి (పసుపుతో కూడిన బండారు చిత్రం) ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా పోతరాజులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ పండగ వలన గ్రామంలో గల ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు ఇతర పశువులు వ్యాధి బారిన పడి మృతి చెందకుండా ఆరోగ్యంగా ఉంటా యని స్థానికుల విశ్వాసం. ఈ ఉత్సవం వలన గ్రామమంతా పండగ వాతా వరణం నెలకొంది. ఈ పండగను మహిళలతో పాటు యువకులు, గ్రామస్థు లు పెద్ద ఎత్తున తిలకించారు. ఈ కార్యక్రమంలో ద్యావాతు పూజారులు (పోతు రాజులు) తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మామడ, మార్చి 21 : మామడ మండల వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, ఆరేపల్లి మాజీ సర్పంచ్ అరవింద్‌రావు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీహరిరావు మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవడం ఖాయమన్నారు. సామ వికాస్‌రెడ్డి, కే.శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, సాయికృష్ణ, సాయినాథ్, భూమన్న, తదితర నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి

నిర్మల్ కల్చరల్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు పిలుపునిచ్చారు. గురువారం నిర్మల్ మండల నూతన కార్యవర్గ సభ్యులు శ్రీహరి రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలు ఇచ్చిన వాగ్దానంలో భాగంగా ఇప్పటికే నాలుగు గ్యారంటీలు అమ లు చేసిందన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరవేసే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీగా విధులు నిర్వహించాలి

ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్



మాట్లాడుతున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

భైంసా రూరల్, మార్చి 21 : లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. భైంసా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం లోక్‌సభ ఎన్నికలకు క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రతీ ఒక్కరూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. నియోజకవర్గ పరిధిలో చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసి, పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించిన నిర్దిష్టమైన సూచనలను కిందిస్థాయి సిబ్బందికి తెలియజేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే కిందిస్థాయి సిబ్బందికి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించడానికి సిబ్బందితో సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించి ప్రతి అంశంపై అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని తెలిపారు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించే వ్యక్తుల మీద నిఘా వేసి ఉంచాలని సూచించారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



విద్యార్థులు అధికారులతో పాటు స్వీప్ బోర్డులను ప్రదర్శిస్తున్న కలెక్టర్

నిర్మల్ టౌన్, మార్చి 21 : ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ హాల్‌లో సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయనున్న కళాశాల విద్యార్థినులకు పోలింగ్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఓటు హక్కు అనేది దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమని ప్రతి ఓటరు మే 13న పోలింగ్ రోజున విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. యువత తాము ఓటు వేయడమే కాకుండా కుటుంబ సభ్యులు ఓటు వేసేలా ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేయాలంటూ ఎన్నికల ప్రక్రియను వివరించారు. ఓటు హక్కును వినియోగించుకుంటే బలమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినవారు అవుతారని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోతే ఎన్నికల సంఘం నోటా అనే అవకాశాన్ని కల్పించిందన్నారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల్లో నూతనంగా 7,078 మంది ఓటర్లు తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఓటింగ్ శాతం పెరగడానికి యువత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నమూనా ఓటింగ్ మిషిన్ పని తీరును విద్యార్థులు పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఆయా కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి : ఎస్పీ

- సిరిపెల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ పరిశీలన



అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ పరిశీలిస్తూ ఆదేశాలిస్తున్న ఎస్పీ

నిర్మల్ కల్చరల్, మార్చి 21 : ఎన్నికల నియమావళిని పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ జానకి షర్మిల సాయుధ పోలీసు బలగాలను ఆదేశించారు. సిరిపెల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్‌తో పాటు సాయుధ ప్రత్యేక బలగాల వసతి గృహాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిల గురువారం సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సిరిపెల్లిలో అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. సాయుధ బలగాలు జిల్లాకు చేరుకున్నారన్నారు. సాయుధ బలగాల ఎన్నికల నియమావళి సజావుగా జరిగేందుకు సహకరించాలని సూచించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చే వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. రూ. 50 వేలకు పైగా నగదు పట్టుబడితే పంచనామా నిర్వహించి గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాలన్నారు. ఎస్‌హెచ్‌వోలు తమ ఏరియాపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నేరస్తులను ముందుగా గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయన్నారు. తనిఖీలు నిర్వహించేటప్పుడు జాగ్రత్తలు వహించాలన్నారు. మౌలిక సదుపాయల కల్పన, రోడ్లు, భద్రత తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, గ్రామీణ సీఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన ఎస్పీ

సారంగాపూర్ : మండలంలో గల సిరిపెల్లి గ్రామ సమీపంలో గల మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దును ఎస్పీ జానకి షర్మిల పరిశీలించి సిబ్బందికి పలు సూచనలను ఇచ్చారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. దీంతో పాటు తనిఖీలో రూ. 50 వేలకు పైగా ఉంటే వెంటనే పట్టుకొని గ్రీవెన్స్ సిబ్బందికి అప్పగించాలని విధులు నిర్వహించే అధికారులతో పేర్కొన్నారు. విధులు నిర్వహిస్తున్న అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే వారిని గుర్తించి ముందుగా బైండోవర్ చేయాలని పోలీసు శాఖ సిబ్బందితో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఎస్సై ప్రవీణ్ కుమార్, సీఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బందిలు ఉన్నారు.

26 నుంచి ఖానాపూర్‌లో

రేణుకమాత ఆలయ అష్టమ వార్షికోత్సవం

ఖానాపూర్, మార్చి 21 : ఈ నెల 26వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు మండల కేంద్రంలోని ఉత్తరవాహిని గోదావరి నది తీరంలో గల రేణుకమాత (ఎల్లమ్మ తల్లి) ఆలయ అష్టమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆలయ ఆవరణలో ఖానాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. 26 నుండి 30వ తేదీ వరకు జోగు ఎత్తడం, 31వ తేదీ రోజు పోచమ్మ తల్లికి బోనాలు, ఒకటో తేదీ గంగస్నానం, పుట్టదని కార్యక్రమాల నిర్వహణ, చివరి రోజు రెండవ తేదీ రేణు ఎల్లమ్మ తల్లికి బోనాల సమర్పణ రేణుక మాత జమదగ్ని కళ్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తలెఇపారు. ప్రతిరోజు రాత్రి ఎల్లమ్మ ఆలయం వద్ద ఒగ్గు కళాకారులచే ఒగ్గు కథ సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

పోలీసుల తనిఖీల్లో నగదు లభ్యం



నర్సాపూర్(జి), మార్చి 22 : మండల కేంద్రంలో వాహనాల తనిఖీలలు చేపట్ట గా నాందేడ్ జిల్లాకు చెందిన ఇర్ఫాన్ ఖాన్ వద్ద 70000 డెబ్బై వేల నగదును పట్టుకొని సీటీవో కలెక్టర్ ఆఫీస్‌కు పంపినట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు. బూర్గుపల్లి జి తాండాలో గుడుంబా విక్రయిస్తున్న రాటోడ్ గోవింద్ వద్ద పదకొండు లీటర్ల గుడుంబా, 4400 నగదు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సుంక్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్

భైంసా రూరల్, మార్చి 21 : మండలంలోని సుంక్లి గ్రామంలో గురువారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం సూపర్‌వైజర్ భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చిరుధాన్యాలు ఆహారంగా తీసుకుంటే దీర్ఘకాలిక వ్యాధులు నయం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కమల, అంగన్‌వాడీ టీచర్స్ స్వాతి, సునీత, లలిత, గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

షార్ట్‌సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన సామాగ్రి

సారంగాపూర్, మార్చి 21 : మండలంలోని స్వర్ణలో రాజేశ్వర్ అనే వ్యక్తి ఇళ్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో ఇంట్లో ఉన్నటువంటి వస్తువులన్నీ దగ్ధమైనట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను వివరాలను అడిగి తెలుసుకొని నివేదికలను తయారు చేసి, నష్ట పరిహారాన్ని అందేలా కృషి చేస్తామని అధికారులు బాధితులతో పేర్కొన్నారు.

రేపు ఖానాపూర్‌కు మంత్రి సీతక్క రాక

ఖానాపూర్, మార్చి 21 : ఖానాపూర్‌కు 23వ తేదీన రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ మంత్రి ధనసరి సీతక్క రానున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, నియోజకవర్గం స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి హాజరవుతారన్నారు. ఈ కార్యకర్తల సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామ, బూత్ స్థాయి నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాగా శనివారం నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరు కానున్న మంత్రి సీతక్క సమక్షంలో పలువురు బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఇదివరకే కాంగ్రెస్‌లో చేరాలనుకునే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జులను కలిసినట్లు విశ్వసనీయ సమాచారం. ఖానాపూర్ పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల వేళ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం సైతం సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఖానాపూర్ నియోజకవర్గంలో భారీగా చేరికలు ఉంటాయని రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

పటిష్టస్థితిలో ముథోల్ బీఆర్ఎస్

భైంసా, మార్చి 21 : ముథోల్ నియోజక వర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టస్థితిలో ఉందని ఆ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి విలాస్ గాదేవార్ పేర్కొన్నారు. గురువారం భైంసాలోని తన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పార్టీని వీడటం మూలంగా బీఆర్ఎస్‌కు వచ్చిన నష్టమేమి లేదన్నారు. నియోజక వర్గ వ్యాప్తంగా గ్రామ గ్రామాన బీఆర్ఎస్ పార్టీకి అంకితభావం గల నాయకులు, కార్యకర్తలు పుష్కలంగా ఉన్నారని వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థికి ముథోల్ నియోజకవర్గం నుంచి అధిక్యతను అందిస్తామని స్పష్టం చేశారు.

పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని

తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



నిర్మల్‌లోని సోమవార్‌పేట బాలికల పాఠశాలలో అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 21 : నిర్మల్‌లోని సోమవార్‌పేట బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పది పరీక్ష కేంద్రాన్ని గురువారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. అక్కడ మన ఊరు - మన బడి నిర్మాణ పనులు, మధ్యాహ్న భోజన నిర్వహణ పరిశీలించారు. మూడో భాషా పరీక్షకు 8,868 మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

సీఎంను కలిసిన కంది శ్రీనివాస్‌రెడ్డి



ముఖ్యమంత్రితో కంది శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్,మార్చి21: ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి జిల్లా ముఖ్యనేతలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని సందర్శించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో గల సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజక వర్గానికి సంబంధించిన పలు అంశాలు, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.వాటికి సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూ హాలపై సీఎం రేవంత్‌రెడ్డి వారికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్క, డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ ఆశావహ అభ్యర్థి ఆత్రంసుగుణ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల సంఘం ఎన్నిక



ఎన్నికైన సంఘం సభ్యులను సన్మానిస్తున్న బోథ్ ఎమ్మెల్యే

భీంపూర్, మార్చి 21 : మండలంలోని పిప్పల్‌కోటిలో గురువారం గంగపత్రుల సంఘంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రింగని వసంత్‌రావు, ప్రధాన కార్యదర్శి ఇప్ప విలాస్, ఉపాధ్యక్షుడు సాత్‌గరి విలాస్‌లను ఎన్నుకున్నారు. కాగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని శాలువాతో సన్మానించారు. సంఘం కోసం పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనిల్ జాదవ్, యువసేన అధ్యక్షుడు షేక్ అఫ్రోజ్, నాయకులు రమేష్, పెంటాన్న, గణపతి, నారాయణ, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి21: అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలంటే జిల్లా ప్రజల సహకారం ఎంతగానో అవసరమని ఆదిలాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని స్పిన్నింగ్ మిల్ ప్రాంతంలో గురువారం మట్కా నిర్వహిస్తున్నారన్న అనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా సంఘటన స్థలంలో షేక్ రఫీక్ తండ్రి ఫరిద్ ఖుర్షిద్‌నగర్‌కు సంబంధించిన వ్యక్తి వద్ద మట్కా నిర్వహిస్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. ఇతడి వద్ద నుంచి రూ.11,100నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకుని ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

భీంపూర్, మార్చి 21 : మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని గ్రామాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాప్‌లను ఎస్సై ప్రదీప్ బుధవారం రాత్రి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. వారి వద్ద నుంచి 13,690 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమానపనికి సమాన వేతనం చెల్లించాలి



దివ్యదేవరాజన్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి21: సమానపనికి సమాన వేతనం చెల్లించాలని మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసురత్నం డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ దివ్యదేవరాజన్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సీపీఐ కొత్తగూడెం శాసన సభ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుని మున్సిపల్ కార్మికులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన కూనంనేని కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, కార్మికులకు రూ.50వేలు ఇప్పించేందుకు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అలాగే దివ్యదేవరాజన్‌కు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందించి ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయుట, కార్మికులను రెగ్యూలర్, కార్మికులకు ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు గురించి సమస్యలపై వివరణ ఇవ్వగా వారుసానుకూలంగా స్పందించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల తర్వాత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారన్నారు. ఇందులో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, సిర్రదేవేందర్, గాజంగుల చంద్రశేఖర్, కాంతారావు, మెరుగు చిరంజీవి, నారాయణరెడ్డి, అశోక్, నక్కశంకర్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'పదేళ్ల పాలనలో అనేక పథకాల అమలు'



పార్టీ కార్యాలయంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఆత్రంసక్కు, జోగు రామన్న

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి21: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పార్టీ గెలుపునకు దగ్గరలో ఉందని, పదేళ్ల పాలనలో అనేక పథకాలు అమలు చేశామని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్నతో కలిసి నాయకులు సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయానికి తొలిసారి రావడంతో వైస్ చైర్మన్ జహీర్‌రంజాని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, కౌన్సిలర్లు పూలమొక్కను అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కు మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేశారన్నారు. ఆ పథకాలు ప్రజలకు గుర్తున్నాయని తెలిపారు. పేదల ఆకాంక్షల మేరకే తమ పాలన సాగిందన్నారు. విభజన సమయంలో కేంద్రంలోని బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. సీసీఐ పునరుద్ధరణ, యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్కు పదేండ్ల కాలంలో ఏది కూడా ఆదిలాబాద్‌కు ఇవ్వలేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. తాము చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తనను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు మాజీ సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఇది వరకే ఏడు నియోజక వర్గాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించామన్నారు. ఎన్నికల వ్యూహాలను రచించామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలకు ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాజిదొద్దీన్, ప్రకాష్, నర్సింగ్, భారత్, అశ్రఫ్, పండ్లశ్రీను, మోబిన్, నారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు మొక్కులు తీర్చుకున్న భక్తులు



మల్లన్న ఆలయ అవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం

ఇచ్చోడ, మార్చి21: కాకతీయుల కాలంలో నిర్మించిన సిరిచెల్మ మల్లికార్జున స్వామి ఆలయంలో ఎనిమిది రోజులుగా జరుగుతున్న జాతర గురువారంతో ముగిసింది. ఈ జాతరకు చుట్టు పక్క జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్దఎత్తున్న హాజరై మల్లన్నకు మొక్కులు సమర్పించుకున్నారు. భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి చల్లంగా చూడు మల్లన్న అంటూ తమ కోరికలను నేరవేర్చుకుంటారు. చివరిరోజు జాతరలో దుకాణ సముదాయాలు సందడిగా మారాయి.

కార్యాలయం సిద్ధం.. రావడమే ఆలస్యం



ప్రారంభానికి సిద్ధమైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బోథ్ రూరల్, మార్చి 21 : బోథ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పూర్తి చేసి దాదాపు రెండేళ్లు కావస్తున్నది. అద్దె గదిలో ఉన్న కార్యాలయాన్ని నూతనంగా నిర్మించిన కార్యాలయంలోకి మార్చేందుకు తీవ్ర జాప్యం జరుగుతోంది. మూలన పడేసినట్లు అద్దె గదిలో ఉన్న జనావాసాల మధ్యకు మార్చేందుకు అధికారులకు ఇష్టం లేక వివిధ కారణాలు చెబుతూ కార్యాలయాన్ని ప్రజలకు అందుబాటులో ఉండే స్థలానికి మార్చడం లేదని అంటున్నారు. ప్రభుత్వ భవనం పూర్తయిన తరువాత అక్కడక్కడ అవసరం కావడంతో రెండు నెలల క్రితం భవనానికి మరమ్మతులు చేపట్టారు. నూతన భవనంలోకి మార్చేందుకు అధికారులు రేపుమాపంటూ పైస్థాయి అధికారులపై నెట్టివేస్తున్నారు. అయితే అద్దె చెల్లింపు కార్యాల యంలో ఓ మూలన ఉండేందుకు అధికారులు ఇష్టపడుతున్నారని సకల వసతులతో నూతనంగా నిర్మించబడ్డ భవనంలోకి మార్చేందుకు ఎందుకు ఇష్టంగా ఉన్నారో అంతుబట్టడం లేదని స్థానికులు అంటు న్నారు. తక్షణమే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నటువంటి పిప్పల్దరు రోడ్డుకు నిర్మించడం భవనంలోకి కార్యాలయం మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

మూడో రోజు పరీక్షలు ప్రశాంతం



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

జైనథ్,మార్చి21: మండలంలోని గిమ్మా, పెండల్‌వాడ జైనథ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షల కేంద్రాల్లో మూడో రోజు గురువారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పెండల్‌వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 76 మంది విద్యార్థులకు గాను మొత్తం మంది విద్యార్థులు పరీక్ష రాశారు. జైనథ్ మోడల్ స్కూల్‌లో 142మంది విద్యార్థులకు గాను మొత్తం విద్యార్థులు పరీక్షలు రాశారు. గిమ్మా పరీక్షలకేంద్రంలో 219మంది విద్యార్థులకు గాను మొత్తం మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. జైనథ్ రెండో పరీక్షల కేంద్రంలో 178 మంది విద్యార్థులకు గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల కేంద్రాలను తహసీల్దార్ శ్యాంసుందర్, ఎస్సై కె.పురుషోత్తం తనిఖీ చేశారు.ఇందులో సీఎస్‌లు, డీవోలు, ఇన్విజిలెటర్లు ఉన్నారు.

బుగ్గారాం(బి) పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డీఎఫ్‌వో ప్రశాంత్

నేరడిగొండ, మార్చి21: ప్రపంచ అటవి దినోత్సవం సందర్భంగా రైటింగ్ అండ్ పెయింటింగ్ పోటీలను జిల్లా అటవి శాఖ అధికారులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుగ్గారాం(బి)లో గల టీటీడబ్ల్యుఆర్‌జేసీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కాగా డీఎఫ్ఓ ప్రశాంత్ విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా అవార్డు అందుకున్న గిరిజన గాయని



ఉత్తమ మహిళా అవార్డు అందుకున్న మర్సుకోల సరస్వతి

ఉట్నూర్,మార్చి21: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బుధవారం మోక్ష గ్లోబల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉట్నూర్ మండలం లక్కారం గ్రామానికి చెందిన ఆదిమ గిరిజన మహిళ, గాయని, రచయిత మర్సుకోల సరస్వతి ఉత్తమ మహిళా అవార్డును అందుకున్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు జాతీయ ఉత్తమ మహిళా సేవ పురస్కార్ 2024 అవార్డులు అందించగా.. ఈ అవార్డుకు మర్సుకోల సరస్వతి ఎంపికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మిస్ ఆసియా రష్మీఠాకూర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని సరస్వతి అన్నారు.

కాంగ్రెస్ గూటికి మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక

భైంసా, మార్చి 21 : నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గురువారం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో విఠల్‌రెడ్డి ఆ పార్టీలో చేరారు. ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క పార్టీ కండువా వేసి విఠల్ రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మామడ వైస్ ఎంపీపీ



కాంగ్రెస్ పార్టీలో చేరిన వైస్ ఎంపీపీకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

మామడ, మార్చి 21 : మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, మాజీ సర్పంచ్ అరవింద్‌రావు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే. శ్రీహరిరావు సమక్షంలో బీఆర్ఎస్ నుంచి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ... అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రతీ ఒక్కరూ పార్టీ పెట్టిన పథకాలకు ఆకర్షితులై ప్రజల కోరిక మేరకే మండల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరాలని, రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు మాట్లాడుతూ... గత ప్రభుత్వం చేయలేని పనులను ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందని నిరుపేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రారంభించి ప్రజలకు లబ్ధి చేకూర్చేలా కృషి చేస్తుందన్నారు. ముమ్మందు ఎందరో ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, నాయకులు డా. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

కుంటాల, మార్చి, 21: రైతులు పండించిన మొక్కజొన్న పంటకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన రైతులు మొక్కజొన్న కల్లాల్లో నిలబడి ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

తానూర్ , మార్చి 21 : మండలంలోని మసల్గలో గురువారం ఉపాధిహామి పనులను ఫీల్డ్ అసిస్టెంట్ మాణిక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉపాధిహామి పనులను వినియోగించకోవాలని సూచించారు.

తాగునీటి సమస్యపై వెంటనే స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీవో

దిలావర్‌పూర్, మార్చి 21 : మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి అజీజ్‌ఖాన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి సమస్యపై గ్రామస్తుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మనమంతా సమన్వయంతో పని చేస్తే ఏ సమస్య ఉండదన్నారు. వేసవిలో వచ్చే వ్యాధులకు అడ్డుకట్ట వేసేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారని మండల వైద్యాధికారి శ్యామ్‌కుమార్ అన్నారు. వైద్య పరమైన ఏ సమస్య ఉన్నా స్థానిక ఆశాలను సంప్రదిం చాలన్నారు. లేదంటే నేరుగా ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో ప్రపంచ అటవీ దినోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాసర సర్కిల్ సీపీఎఫ్ శర్వానన్

సారంగాపూర్, మార్చి 21 : మండలంలో గల గండి రామన్న హరిత వనంలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని అటవీశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు గండిరామన్న హరితవనంలో పెంచుతున్నటువంటి మొక్కలను విద్యార్థులకు చూపించి అడవుల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు అటవీ శాఖ అధికారులు వివరించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన బాసర సర్కిల్ సీపీఎఫ్ శర్వానన్ ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మానవ మనుగడకు ఆధారంగా నిలుస్తున్న అడవులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. దీంతో పాటు వన్యప్రాణులను సంరక్షించే బాధ్యత అందరిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రామ్‌కిషన్‌యాదవ్, డివిజనల్ అధికారి రవీందర్, రేంజ్ అధికారి రమేష్‌రావులతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుంటాల : మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్ అటవీ పర్యటనలో భాగంగా విద్యార్థులకు మానవ మనుగడకు మొక్కల ఉపయోగం గురించి వివరించారు. జీవకోటికి మూలధారమైన ప్రాణవాయువు తయారీ, పర్యావరణ సమతుల్యతకు కారణమైన తమ కార్బన్ వాయువులైన కార్బన్‌డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్‌లను పీల్చి పచ్చని చెట్లు పర్యావరణ సమతుల్యానికి కారణమైనాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

25న హోలీ వేడుకలు నిర్వహించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న వేద పండితులు, వీహెచ్‌పీ ప్రతినిధులు

భైంసా, మార్చి 21 : విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర, జిల్లా శాఖల సూచనల మేరకు ఈ నెల 24న (ఆదివారం) కామదహనం, 25న (సోమవారం) హోలి పర్వదిన వేడుకలు నిర్వహించుకోవాలని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జల్‌వార్ వెంకటేష్, భైంసా ప్రధాన కార్యదర్శి పెరుగు నవీన్‌లు వెల్లడించారు. గురువారం భైంసాలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేద పండితులు, వీహెచ్‌పీ ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించి పర్వదిన నిర్వాహణ వివరాలు తెలిపారు. ఇందులో శ్రీమాన్ చక్రవర్తుల సుధన్వాచార్య స్వామి, శిరిన్ బేలే స్వామిలతో పటు పలువురు పాల్గొన్నారు.

అఖండ హరినామ సప్తాహంలో పాల్గొన్న ఎమ్మెల్యే

తానూర్ , మార్చి 21 : మండలంలోని మొగ్లి గ్రామంలో గురువారం నిర్వహించిన అఖండ హరినామ సప్త కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రాంరావుపాటిల్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయన వెంట నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులున్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోండి

నిర్మల్ కల్చరల్, మార్చి 21 : వేసవి దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త పడాలని ఉప వైద్యాధికారి రాజేందర్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటిన, తలనొప్పి, కండరాల నొప్పి, వికారం వాంతులు ఉంటే లక్షణాలన్నారు. నాడి వేగంగా కొట్టుకోవడం, శ్వాస రేటు పెరగడం తదితర లక్షణాలుంటాయన్నారు. పలు జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ శ్రీనివాస్, మీడియా అధికారి రవీందర్, డాక్టర్ మనీషా, కమ్యూనిటీ ఆర్గనైజర్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దస్తూరాబాద్, మార్చి 21 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంఆ ఉండాలని స్థానిక ఎస్సై ఎండీ యాసిర్ అరాఫత్ అన్నారు. మండలంలోని దేవునిగూడెం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్, సీసీ కెమెరాల ఉపయోగం గురించి వివరించారు. అలాగే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ వాడాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా గుడుంబా అమ్మిన తయారు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

విజయవంతంగా పోషణ పక్వాడ కార్యక్రమాలు

లక్ష్మణచాంద, మార్చి 21 : మండలంలోని మునిపెల్లి, పొట్టపెల్లి, లక్ష్మణచాంద, పార్‌పెల్లి, రాచాపూర్, వడ్యాల్, చామన్‌పెల్లి, చింతల్‌చందా, పీచర, బాబాపూర్ తదితర గ్రామాల్లో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయుల ద్వారా కొనసాగిన ఈ కార్యక్రమంలో పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలుపుతూ రంగవల్లులు వేశారు. పోషక విలువలు గల ఆహార పదార్థాలను ప్రదర్శిస్తూ ఏఏ ఆహారంలో ఎలాంటి పోషకాలు లభిస్తాయో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.7, కనిష్ఠం 23.2



ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 22 మార్చి 2024

డయల్ యువర్ డీఎంకు స్పందన

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి21: డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలను, అర్జీలను పరిష్కరించడానికి కృషి చేస్తామని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన తెలిపారు. గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఫిర్యాదులు, సలహాలు అందేశారు. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడిపిస్తామని అన్నారు.



పొలిటికల్ గేమ్.. షురూ!

- షెడ్యూల్ విడుదల కావడంతో ప్రజల్లోకి ప్రధాన పార్టీలు
- బీజేపీని వెంటాడుతున్న గ్రూపు విభేధాలు
- బీఆర్‌ఎస్‌కు తలనొప్పిగా మారిన వలసలు
- వరుస చేరికలతో జోష్‌లో.. కాంగ్రెస్
- ఓటర్ల మద్దతు కోసం అభ్యర్థుల ప్రయత్నాలు

ఆదిలాబాద్, మార్చి21(ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో పొలిటికల్ గేమ్ మొదలయ్యింది. ప్రచారం పేరిట ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్తున్నారు. అప్పుడే ఆరోపణలు, ప్రతి ఆరోపణలతో విమర్శనాస్త్రాలకు పదును పెడుతున్నారు. ఎన్నికలకు ఇంకా 52 రోజుల సమయం మిగిలి ఉండడంతో అభ్యర్థులు పార్లమెంట్ పరిధిలోని నియోజక వర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలను కలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్, బీజేపీలు అభ్యర్థులను ప్రకటించగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఖరారు దాదాపుగా పూర్తయినట్లుగానే తెలుస్తోంది. అధికారిక ప్రకటన చేయడమే ఆలస్యంగా కనిపిస్తోంది.

ఆదిలాబాద్ లోక్‌సభ పరిధి ఎక్కువ కావడంతో మిగిలిన 52 రోజుల్లోనే పార్లమెంట్ నియోజక వర్గంలో ప్రచారాన్ని పూర్తి చేసేందుకు అభ్యర్థులు పక్కాప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. గ్రామాల మాట ఎలా ఉన్న కనీసం మండల కేంద్రాల వారీగానైనా ప్రచారాన్ని చేపట్టేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ కనిపించింది. ఈ సారి కూడా అదే పరిస్థితి కనిపిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల చుట్టే లోక్‌సభ ఎన్నికల రాజకీయం అన్నట్లుగా మారింది. అంతటా ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటముల పైననే జోరుగా చర్చ జరుగుతోంది. ఏ సామాజిక వర్గం ఏ పార్టీకి మద్దతుగా నిలుస్తుందోనన్న టాక్ వినిపిస్తోంది. ప్రచారంలో అందరికంటే ముందున్న బీజేపీ ఇప్పటికే రెండు బహిరంగ సభలను నిర్వహించింది. బీఆర్‌ఎస్ పార్లమెంట్ స్థాయి సమావేశాన్ని నిర్వహించి నేతలకు దిశా నిర్దేశం చేసింది. మిగిలిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఖరారైతే ప్రచారం మరింత ఊపందుకునే అవకాశం కనిపిస్తుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రత్యక్ష ప్రచారం, సోషల్ మీడియా వేదికగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

కమలంలో కస్సుబుస్సు..

సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ దక్కించుకునేందుకు కమలం పార్టీ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. అయితే నేతల మధ్య విభేధాలు ఆ పార్టీకి కొంత ఇబ్బందికరంగా మారుతున్నాయి. మొన్నటి వరకు బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగిన గోడం నగేష్‌ను బీజేపీ పార్టీ అభ్యర్థిగా ప్రకటించడంతో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుతో పాటు మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావు, మరికొంత మంది ముఖ్య నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. నేతల మధ్య ఆధిపత్యపోరు కనిపిస్తుంది. ముఖ్యంగా ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్, ముథోల్ నియోజక వర్గాలలో నేతల మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇంకా అసెంబ్లీ ఎన్నికల వేడి చల్లారక ముందే లోక్‌సభ ఎన్నికల హడావుడి మొదలు కావడంతో నేతలు విభేధాలను విడిచి పెట్టినట్లు కనిపించడం లేదు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల్లో నేతల మధ్య విబేధాలు కొనసాగుతునే ఉన్నాయి. కొత్తగా పార్టీలో చేరి ఎంపీ టికెట్‌ను దక్కించుకున్న అభ్యర్థికి పార్టీ వ్యవహారాలతో పాటు సరైన పరిచయాలు లేక పోవడంతో కొంత ఇబ్బందికరంగా మారింది.

బీఆర్‌ఎస్‌లో చేజారిపోతున్న క్యాడర్..

పదేళ్ల పాటు అధికారం చేపట్టి ఓటమి పాలైన బీఆర్‌ఎస్‌లో నాయకత్వ లోపం కనిపిస్తుంది. గత కొద్ది రోజులుగా బీఆర్‌ఎస్ నేతలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలలో చేరిపోవడంతో కారు పార్టీ ఖాళీ అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ గోడంనగేష్, పలువురు సర్పంచ్, ఎంపీటీసీలు పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరిపోగా మిగతా ఆరు నియోజక వర్గాల్లోను ఇదే పరిస్థితి కనిపిస్తోంది. తెలంగాణ కోసం పోరాడి సాధించిన ఉద్యమ పార్టీపై అభిమానం ఉన్న ప్రజల్లో ఆదరణ లేక పోవడంతో పార్టీ పలుచబడుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆ పార్టీ నేతల అతి ధీమానే కొంప ముంచిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నేతల వలసలను ఆపేందుకు పడరాని పాట్లు పడుతున్న అడ్డుకట్ట పడడం లేదంటున్నారు. అధికారం కోల్పోవడంతో పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరిపోవడంతో క్యాడర్ మొత్తం చెల్లా చెదురై పోతోంది. అధికారానికి దూరం కావడంతో పార్లమెంట్ పరిధిలో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

హస్తంతో దోస్తికి సై..

కాంగ్రెస్ పార్టీతో కలిసి వెళ్లేందుకు పలువురు నేతలు ఆసక్తి చూపడంతో ఆ పార్టీలో జోరుగా చేరికలు జరుగుతున్నాయి. ముఖ్యంగా బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరిపోతున్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. లోక్‌సభ షెడ్యూల్ విడుదల కావడంతో చేరికలు మరింతగా ఊపందుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడమే నేతల చేరికకు అసలు కారణంగా తెలుస్తోంది. బీజేపీ సిద్ధాంతాలను వ్యతిరేకిస్తున్న వారంతా హస్తం గూటికి చేరుతున్నారు. మరో పదేళ్ల పాటు అధికారంలో ఉండవచ్చనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారు. పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజక వర్గాలకు గాను ఖానాపూర్ నియోజక వర్గంలోనే కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. మిగతా నియోజక వర్గాలపై మరింత పట్టు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పాలైన రాథోడ్‌రమేష్ బీజేపీలో చేరిపోవడంతో నాయకత్వ లోపం కనిపిస్తోంది. ఈ సారి కొత్త అభ్యర్థులను బరిలోకి దింపేందుకు పార్టీ అధిష్ఠానం ప్రయత్నాలు చేస్తోంది. అయితే వరుస చేరికలతో కాంగ్రెస్‌లో నయాజోష్ కనిపిస్తోంది.

అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలి : కలెక్టర్



పిప్పర్‌వాడ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

జైనథ్, మార్చి21: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలను ప్రభావితం చసే గంజాయి, మద్యం, డబ్బు తదితర అన్ని వస్తువుల అక్రమ రవాణాను పూర్తిగా నిషేధించాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో బేల మండలం శంకర్‌గూడ దగ్గర జైనథ్ మండలం ఆనంద్‌పూర్ పిప్పర్‌వాడ, భీంపూర్ మండలం కరంజి, తలమడుగు మండలం లక్ష్మీపూర్, బోథ్ మండలం ఘన్‌పూర్ దగ్గర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఈ చెక్‌పోస్టు ఫారెస్టు, పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులతో 24గంటల పాటు నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, జైనథ్ రూరల్ సీఐ సాయినాథ్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎస్సై కె.పురుషోత్తం ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉట్నూర్, మార్చి21: భారత్ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం గురువారం ఉట్నూర్ మండల ఎన్నికల సెక్టోరియల్ అధికారి రాథోడ్‌వినోద్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని దంతంపల్లి, బీర్సాయిపేట్, చెరువుగూడ ఘన్పూర్, దొంగచింత, హీరాపూర్ జె, గోండు కొత్తగూడలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. దివ్యాంగులు, వృద్ధులు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ర్యాంపులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో మంచినీటి వ్యవస్థ, మూత్రశాలలు, మరుగుదొడ్ల తదితర సౌకర్యాలను పరిశీలించారు.ఆయన వెంట రూట్ ఆఫీసర్ సాయికృష్ణ, బూత్ లెవల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి21: పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపియింగ్ జరుగుతుందని సోషల్ మీడియా వేదికగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని గురువారం ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి సందర్శించారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం వారికి కల్పించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అసౌకర్యాలు కలుగకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ ఉట్నూర్‌లో ఉర్దూ పేపర్ లీక్ అయిందని, మాస్ కాపియింగ్ జరుగుతుందని సోషల్ మీడియాలో వైరల్ అయిందన్నారు. దీనిపై అక్కడి ఎంఈవోతో విచారణ చేయించి, అలాంటిదేమీ లేదని తెలిసిందన్నారు. ఫేక్ న్యూస్‌ను వ్యాప్తి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని 53 కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపియింగ్ లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. తప్పుడు సమాచారాన్ని వైరల్ చేసిన వారిపై ఉట్నూర్ స్టేషన్‌లో కేసు నమోదైందని ఎస్పీ తెలిపారు. వ్యక్తిగత కక్షల కారణాలతోనే సోషల్ మీడియా ద్వారా ఓ వ్యక్తి మాస్ కాపియింగ్ జరుగుతుందని ప్రచారం చేశాడని తమ విచారణలో తేలిందన్నారు. వారి వెంట ఎంఈవో జయశీల, డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులున్నారు.

ముగ్గురి రిమాండ్

ఉట్నూర్: పదో తరగతి పరీక్షలో గత మంగళవారం ఉర్దూ ప్రశ్నాపత్రం బయటకు వెళ్లిందంటూ సామాజిక మాధ్యమంలో దుష్ప్రచారం చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి జిల్లా పోలీసు అధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని ఉట్నూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ తెలిపారు. ఇదివరకు ఉట్నూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో పని చేసి వెళ్లి పోయిన ఏకలవ్య గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు మొహమ్మద్ ముబాసిర్‌తో పాటు కాగజ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ఆసీఫ్, మరో ఇంటర్ విద్యార్థి హస్నాపూర్‌కు చెందిన సయ్యద్ కైఫ్‌ను రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. గతంలో కాగజ్‌నగర్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన వెంకటప్రసాద్‌పై కక్షపెంచుకున్న ఆసీఫ్, ముబాసిర్‌లు కావాలని పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ అయినట్లు సామాజిక మాధ్యమంలో ప్రచారం చేసి కలకలం సృష్టించారన్నారు. ఇకముందు ఎవరైనా కూడా సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

అడవుల సంరక్షణకు కృషి చేయాలి

- కలెక్టర్ రాజార్షిషా
- ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

ఆదిలాబాద్‌అర్బన్,మార్చి21: ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ కార్యక్రమం విజయవంతం కాదని, అందుకే అడవుల సంరక్షణకు కృషి చేయాల్సిన అవసర ముందని కలెక్టర్ రాజార్షిషా అభిప్రాయపడ్డారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని అలరించారు. ఈ సందర్భంగా అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. చివరగా అటవీ సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అడవులు లేని కారణంగా ప్రస్తుతం భూతపం అనేది పెరుగుతుందన్నారు. పర్యావరణం సమతుల్యతంగా ఉండాలంటే చెట్లు ఉండాలన్నారు. బాధ్యతాయుతంగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అడవులను కాపాడడంలో అటవీ శాఖ అధికారులు ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. వారి త్యాగాలను స్మరించాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు అటవీ శాఖ కార్యాలయం నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. డీఎఫ్‌వో ప్రశాంత్‌బాజీరావ్‌పాటిల్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధానవీధుల గుండా సాగింది. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీఎఫ్‌వో ప్రశాంత్‌బాజీరావ్‌పాటిల్, ఎఫ్‌డీవో బర్నోబా, ఎఫ్‌ఆర్‌వో గులాబ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో



ఉట్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు

పర్యావరణాన్ని రక్షిద్దాం

ఉట్నూర్ : పర్యావరణ రక్షణ కోసం అడవులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలందరు అడవులు కాపాడుకోవడానికి సహకరించాలని బీర్సాయిపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ గులాం మోహినుద్దీన్ అన్నారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం పురస్కరించుకుని ఉట్నూర్ మండల కేంద్రంలో బీర్సాయిపేట, ఉట్నూర్ ఫారెస్టు అధికారులు సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజలను జాగృతం చేశారు. ఈ సందర్భంగా మోహినుద్దీన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అడవులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రభుత్వం టైగర్ జోన్ ఏర్పాటు చేయడం వల్ల అడవులు రక్షించబడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో అనిత, గోపాల్ సింగ్, ప్రేమ్‌సింగ్, ప్రియాంకచౌహాన్, లచ్చన్న, దస్సింగ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



మజ్జిగ పంపిణీ చేస్తున్న రీజినల్ మేనేజర్

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి21:ఎండల తీవ్రత దృష్ట్యా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు మధ్యాహ్నం సమయంలో ఆదిలాబాద్ ఆర్టీసీడిపో ఉద్యోగులందరికి మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రీజినల్ మేనేజర్ సోల్మన్ మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమం వేసవి కాలం అయిపోయే వరకు ఉంటుందన్నారు. డిప్యూటీ ఆర్‌ఎంవో ప్రణీత్, ప్రవీణ్‌కుమార్, డిపో మేనేజర్ కల్పన తదితరులున్నారు.

కన్నుల పండువగా శబరిమాత పల్లకీ ఊరేగింపు

బోథ్ రూరల్, మార్చి 21 : మండలంలోని కనుగుట్ట గ్రామంలో గురువారం శబరి మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలో శబరిమాత పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో శబరి మాత విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ఆశ్రమ భక్త బృందం తెలిపింది. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి భక్తులు రామనామ సంకీర్తన చేస్తూ భజన కార్యక్రమాలు చేశారు. రాత్రి పూట ఆశ్రమంలో వివిధ గ్రామాల భజన బృందాల వారు భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ వారు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. గ్రామస్థులకు, భక్తులకు అన్నదానాన్ని నిర్వహించారు.



కనుగుట్ట గ్రామంలో పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఆదిలాబాద్‌అర్బన్,మార్చి21: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సహాయకలెక్టర్ వికాస్ మహతో తన చాంబర్‌లో ఎంసీఎంసీ మీడియా సర్టిఫికేషన్ మా నిటరింగ్ కమిటీ మొదటి సమావేశం కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఈ సమావేశంలో పెయిడ్ న్యూస్, సోషల్ మీడియా,ప్రింట్ మీడియా, ప్రీసర్టిఫికేషన్ ఆఫ్ అడ్వార్టైజ్‌మెంట్‌లో వచ్చే అంశాలపై మాస్టర్ శిక్షకులు లక్ష్మణ్ అవగాహన కల్పించారు. ఎంసీఎంసీసెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటలను ప్రసారం చేయడం తదితర అంశాలపై దృష్టి సా రించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమించిన పోస్టులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు. అభ్యర్థి చేసిన ప్రతి ఖర్చు ను లెక్కలో చూపించాలని, దీనికి సంబంధించినసెక్షన్ డిలో స్పష్టంగా పేర్కొని, రోజూ వారి ఖర్చు వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న సహాయ కలెక్టర్ వికాస్ మహతో

ఎన్నికలను సమన్వయంతో పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ఖుష్బూ గుప్తా

బోథ్ రూరల్, మార్చి 21 : రానున్న పార్లమెంట్ ఎన్నికలను అధికారులు సమన్వయంతో పని చేసి విధులు నిర్వహించాలని బోథ్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం బోథ్ తహసీల్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ స్థాయి రెవెన్యూ మండల పరిషత్ పోలీసు వివిధ శాఖల అధికారులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా రోడ్లలోని అధికారులు గ్రామాల్లోకి వెళ్లి పోలింగ్ కేంద్రాల్లోని సమస్యలను గుర్తించాలన్నారు. అంతేగాక సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సంబంధిత పోలీసు అధికారులతో కలిసి చర్చించాలన్నారు. గ్రామాల్లోకి వెళ్లిన అధికారులు పోలింగ్ స్టేషన్‌లో ఉన్న వసతులను పరిశీలించడంతో పాటు పోలింగ్ స్టేషన్ల మధ్య ఏ మేరకు దూరం ఉందనేది గమనించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులను పరిశీలించాలని ముఖ్యంగా ఎన్నికలు ఎండాకాలంలో జరగనున్నందున తాగునీటి వసతి ఉందా లేదా అనేది పరిశీలించాలన్నారు. మరో వైపు గ్రామాలలోకి ఎన్నికల సిబ్బంది వెళ్లేందుకు సరైన రోడ్డు వసతి ఉందా లేదా అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. గతంలో విధులు నిర్వహించిన అధికారులు అనుభవంతో ఎన్నికలను సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఓటరు జాబితాలు సిద్ధంగా ఉన్నాయని, ఏమైనా అనుమానాలు ఉంటే మరోసారి పరిశీలించాలని సూచించారు. పోలీసు అధికారులు సైతం సమస్యాత్మక గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసులు, అధికారులు హాజరయ్యారు.

భద్రతాభావం పెంపొందించేందుకు ఫ్లాగ్‌మార్చ్

- ఎస్పీ గౌస్ ఆలం
- పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఫ్లాగ్ మార్చ్

ఆదిలాబాద్ అర్బన్, మార్చి21:పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాకు చేరుకున్న కేంద్ర సీఆర్‌పీఎఫ్ బలగాలు, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కలెక్టర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఫ్లాగ్‌మార్చ్‌ను జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఐపీఎస్‌జెండా ఊపి ప్రారంభించారు. ఫ్లాగ్ మార్చ్‌లో ప్రజలలో భద్రతా భావం పెంపొందించేందుకే, ప్రజలు ఎటువంటి భయాందోళనలకు లోనవకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవడానికి చేపట్టామని తెలిపారు.పట్టణంలోని ఎన్టీఆర్‌చౌక్, వినాయక్ చౌక్, నేతాజిచౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, దేవిచంద్‌చౌక్, వన్‌టౌన్, వినాయక్‌చౌక్ మీదుగా ఎన్టీఆర్‌చౌరస్తా వద్ద ఫ్లాగ్ మార్చ్ ముగిసింది. సీఆర్‌పీఎస్ సిబ్బంది ముఖ్యంగా ఎన్నికలలో కీలకమైన విధులైన ఈవీఎంల భద్రత, చెక్‌పోస్టులు నిర్వహణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద విధులు, వీవీ పాట్‌ల వద్ద భద్రత, స్ట్రాంగ్‌రూమ్ విధులు నిర్వహిస్తుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ శ్రీకాంత్, పట్టణ సీఐలు సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, ఫణిదర్, సాయినాథ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్, జిల్లా ఎస్సైలు రిజర్వ్ సిబ్బంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

